ఇవాళ...నెలాఖరు రోజులు కనక...ఆరు పైసలు కూడా మిగలలేదు గోపాలం దగ్గిర. ఆర్థికంగా బలహీనుడైనవాడు మాటలలోకూడా అసమర్థుడే ఔతాడు. అయ్యరుని అరువు అడగడానికి గోపాలానికి భయం. దానికి మారుపేరు పెట్టి ముద్దుగా ఆత్మాభిమానం అనుకుని సరిపెట్టేసుకుని హాఫ్‌టీ కూడా తీసుకోకుండానే రోడ్డు మీదికి వచ్చేశాడు. 'అది టీ ఏమిటి? బెల్లం కలిసిన వేడినీళ్ళు!' అనుకుంటూనే కసిగా ఓ మైలు దూరం తిరిగాడు.

ఈసారి అతని శరీరమే ఎదురుతిరిగింది. పెట్టుబడి పెడితే తప్ప పనిచేయలేనని సమ్మె ప్రారంభించింది. చేయగలిగేది లేక కార్పొరేషన్ కుళాయిని సాయం అర్థించాడు. ఆ సమయంలో తను మరో ఎండమావినని నీరసంగా, జాలిగా నవ్వేసింది కార్పొరేషన్ కొళాయి. అభిమానధనుడైన గుమాస్తా గోపాలం, అభిమానమనే కపటధనమే తప్ప నిజంగా పైసా కూడా జేబులోలేని నిర్ధనుడు. ఓ పెద్ద హోటల్‌లోకి వెళ్ళి నిలుచున్నాడు ఎట్టకేలకు సాహసించి, ఆ హోటల్ వైభవానికి భయపడిపోతూ, నోట మాటరాక మైసూర్ మహారాజాలా కిరీటం ధరించిన ఓ మనిషిని బేరర్‌గా చాలా శ్రమపడిన అనంతరం గుర్తించి, నోరు విప్పకుండానే సంజ్ఞ చేశాడు దీనంగా, మంచినీళ్ళు కావాలన్నట్లు. అతను ఒక్క చూపులోనే చెప్పేశాడు. 'హోహోయ్, గుమాస్తా, ఇక్కడ మనుషులు ఫ్రీ సప్లయ్ చెయ్యరు. టిప్ ఇస్తే ఓ టంబ్లరు తెస్తాను.' లెంపలేసుకోవడంకూడా మరిచిపోయి బయపడ్డాడు గోపాలం. లోపలి దాహం క్రమపరిణామం చెందుతూ అక్రమమైన ఆకలిగా పరివర్తనచెంది గోపాలాన్ని నిలదీయసాగింది. రోడ్డు కంటే ఇల్లేపదిలమనిపించింది ఆకలి తీర్చుకోవడానికి. "కనీసం మూడంకె వేసుకుని పడుకోవచ్చును కదా" అనుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. వంటింటి పక్కనుంచి ప్రారంభమయ్యే మేడ మెట్ల దగ్గిర అతను ఆగడానికి కారణం ఎంతమాత్రమూ వంటయి ఉంటుందన్న అపోహగాని, దురాశకాని కావు. నిజమో అబద్ధమో తేల్చుకోకుండానే గుమాస్తా గోపాలం ఓ సిద్ధాంతం అమలు జరుపుతున్నాడు అనాదిగా. రాత్రి ఆలస్యంగా తింటే ఉదయం ఆకలి వెయ్యదనీ, తొమ్మిదిన్నర వరకూ ఏమీ తినకుండా ఉండవచ్చుననీ తన సిద్ధాంతంలో ఆశ నిలుపుకున్నాడు. ఆ సిద్ధాంతం నిజమైనా కాకపోయినా, అలవాటనేది మనిషిని కొన్ని విధాల సుఖపెట్టగలదన్న సూత్రం అతణ్ణి అనుగ్రహించింది. కాని...

ఈ క్షణాలలో అలవాటు మరిచిపోయాడు గోపాలం.

రెండు కూరలూ, కంచం నిండుగా అన్నమూ, కంచంపక్క ఆకుదొన్నెలో మరేదో ద్రవపదార్థమూ – గుమాస్తా గోపాలం కంటికి, ఒక అధరువుతో అన్నం తినే గోపాలం నోటికి – విందు భోజనమే అనిపించింది.

ఒక క్షణంలో అతని ఆకలి వెయ్యి రెట్లయిపోయింది.

అనుకోకూడదు గానీ; అన్నం తింటున్న పిల్లలపై అతనికి అసూయే కలిగింది. ఆత్రంగా వంటింటిలోకి నడిచి, పీట వాల్చుకోకుండానే కూలబడ్డాడు.

కొంచం తెల్లబోయి చూసింది రాధ.

"ఆకలేస్తుంది. నాకూ అన్నం పెట్టెయ్యి..."

మెల్లగా అంది రాధ; "కాళ్ళు కడుక్కుని..."

గోపాలానికి కోపం వచ్చింది. మూడో తరగతి అయినా పాసుకాని రాధ కాళ్ళు కడుక్కోమని తనకు చెప్పాలా! జోళ్ళు లేక, నడిచి నడిచి ధూళి పట్టించుకున్న గుమాస్తా కాళ్ళకు చన్నీటికి మించిన మరో యాంటీ సెప్టిక్ ఏమీ ఉండదని తనకు తెలీదూ? ఆవిర్లు వచ్చే కాళ్ళ మీద చన్నీరు గుమ్మరించుకుని

రాధమీద గోపాలానికి జాలి వెయ్యలేదు. ఒళ్ళు మండిపోయింది !

బీటలువారిన గచ్చుమీద కసిగా కంచం లాక్కున్నాడు.

కుయ్యోమని దీనారావం చేసింది అల్యూమినియం కంచం.

"అన్నం పెట్టు..."

రాధలో చలనం లేదు.

"అన్నం పెట్టమని అడుగుతూంటే వినపడటంలేదూ?" ఆకలి మూలంగా కాబోలు అతని కంఠంలో కోపమూ, విసుగూ, అసహనమూ పాళ్ళు మించి కలగలిశాయి.

కొంచం చలించిపోతూ అంది ఆమె; "ఇంకా చారు మరుగుతూంది."

"ఇన్ని కూరలూ అవీ ఉండగా ఇవాళ కూడా చారుమెతుకుల ఖర్మమేం? చారునీళ్ళొక్కరోజు తప్పినా తప్పడమే. త్వరగా పెట్టెయ్యి."

ఏం చేయడానికీ తోచనట్లు, అనుకోని ప్రమాదంలో చిక్కుకున్నట్లు, ఊహించని పరిస్థితి ఎదురైనట్లు స్థాణువై నిలుచుందామె.

పిల్లలిద్దరికీ ఈ ధ్యాసేమీ లేదు. ఆత్రంగా కంచాలు ఖాళీ చేస్తున్నారు.

"చెబుతూంటే నీక్కాదూ? నా మాటలు వినపడుతున్నాయా? ముందు వడ్డించు." ఆలస్యానికి తాళలేక అసహనంగా అన్నాడు గోపాలం.

"ఆ కూరలూ అవీ...పిల్లలకి. ఇకలేవు..." తడబడిపోయింది రాధ. ఆమె గొంతు వణికిపోయి మాటలు అస్పష్టమయ్యాయి.

కళ్ళముందు భయంకరమైన మెరుపు మెరిసినట్లయింది గోపాలానికి. ఆ మెరుపులో కత్తి అంచులవంటి వాడి నిజాలేవో బయటపడి నట్లనిపించాయి. నిప్పులు చెరిగే కళ్ళతో రాధవంకచూసేడొక్కసారి.

వెయ్యి నేరాలు చేసి దాచుకుంటున్నట్లే కనిపించిందామె అతని కంటికి. ఉద్రేకంగా లేచి నిలుచుని పిల్లలనీ, రాధనీ చూసేడు.

పరిస్థితి పూర్తిగా అర్థమై పోయినట్లే అనిపించింది.

కసిగా కంచాన్ని కాలితో ఒక్క తాపు తన్నేడు.

"స్వార్థానికైనా హద్దులుండాలి. పిల్లలకి పెట్టావు. నువ్వూ తినే ఉంటావు. నాకు మాత్రం లేదనగలిగావు ! ఆ మాట చెప్పడానికి నీకు నోరెలా వచ్చింది. ఆడదానివి కావూ ! సిగ్గు లేకపోతే, కనీసం హృదయమైనా లేదూ నీకు?"

ఆమె కంటినుండి జారిన కన్నీరతను చూడలేదు.

ఏదో చెప్పుకోవాలని ఆమె చేసిన విఫలయత్నాన్ని గమనించలేదు. గట్టిగా ఛీత్కారం చేస్తూ ఆవేశంగా మేడ మెట్లెక్కి నిలువెల్లా కంపిస్తూ నులకమంచంలో కూలబడ్డాడు. అతని శరీరం స్వేదమయం కాసాగింది. జరిగినది భరించలేకపోతున్నట్లు కంపించిపోసాగేడు.

ఎంత స్వార్థం రాధలో !

గతంలో ఈమె కోసం ఎన్ని త్యాగాలు చేశాడు తను ! ఏడు సంవత్సరాలౌతుందేమో రాధ తన జీవితంలో ప్రవేశించి. అవును. అంతే. అప్పటినుంచీ తన బ్రతుక్కి గ్రహణం పట్టింది.

అంతకు ముందు తా నెన్నడూ ఆకలిని చంపుకోలేదు.

అహాన్ని చంపుకోలేదు. రాజాలా బ్రతికాడు.

రాధ వచ్చాక...తోటి గుమాస్తా అప్పారావు అరవై పైసల టిఫిన్ తింటూంటే, పక్కన కూర్చుని అరకప్పు టీతో ఆకలి వాయిదా వెయ్యగలగడం నేర్చుకున్నాడు. కొత్తబట్టల మీది కోరిక చంపుకొని చిరిగిన బట్టలకు మాసికలు వేసి మళ్ళీ మళ్ళీ ఉపయోగించడం ప్రారంభించాడు. అంతవరకూ ప్రసాద్‌లా ప్రతి సినిమా చూసే తను సినిమాహాలు చుట్టూ తిరుగుతూ మాటలు, పాటలూ వింటూ, వాల్‌పోస్టర్లూ, స్టిల్సూ చూసి సినిమా ఊహించుకుంటూ తీయని ఆత్మవంచన కలహాటుపడిపోవడం ప్రారంభించాడు.

ఇప్పుడు తనకి సరదాలు మిగలలేదు. కోరికలు...కొన్ని కనీసపు కోర్కెలు మాత్రం మిగిలాయి.

క్యూలో పంచదార కోసమూ, బియ్యం కోసమూ నిలబడే బాధ తప్పాలి. నెలాఖరుకు పచారీషాపులో తను తీర్చలేనంత అప్పు పెరగకుండా ఉండాలి. రెండోవాడి లివర్ తగ్గాలి. లేకపోతే డాక్టర్ బిల్లు తన జీతంలో చాలా భాగం తినేస్తుంది. దరిద్రులకు ఆకలెక్కువ. ఆరోగ్యంగా ఉన్న పెద్దవాడికి ఆకలి, లివర్‌జబ్బుతో చిన్నవాడికి ఆకలెక్కువ! వాళ్ళ ఆకలి తీర్చలేదు తను !

ఇప్పుడు తనకి అభిమానం మిగలలేదు. ఆకలే మిగిలింది. బ్రతుకు చూస్తే భయాలమయం. అన్నిటి ముందూ, అందరిముందూ తను పరాజితుడు ! జీవచ్ఛవ ప్రయోగానికి నిరూపకం తను. ఎందుకు బ్రతకాలి ఇలా కోరికలను చంపుకుంటూ, సుఖాలు శూన్యం చేసుకుంటూ? కలలా హాయిగా సాగవలిసిన జీవితం, వలలా బాధలమయం ఎందుకైంది?

కారణం రాధ...పిల్లలు. వీళ్ళ బ్రతుకులు తెల్లవార్చాలని తన తపన. కాని తన కష్టం ఎవరు గుర్తించారు? తనపట్ల కనీసం కృతజ్ఞత అయినా లేదు రాధలో. విశ్వాసం లేదు.

పిల్లలకూ రాధకూ మంచి భోజనం. వాళ్ళ కోసం అష్టకష్టాలూ పడుతున్న తనకేమో చాలీచాలనిచారూ మెతుకులూ. ఎక్కడి న్యాయమిది? ఎటువంటిన్యాయం? ఎన్నాళ్ళనించి ఇలా మోసం చేస్తూందో రాధ !

హృదయంలేని వీళ్ళను, విశ్వాసంలేని వీళ్ళను ఎందుకు మేపాలి తను, తన కోరికలను చంపుకుని? ఆకాశాన్నంటే ధరలలో, ఎవరి జీవితం గడవడం వారికే కష్టంగా అవుతున్న ఈ రోజులలో తను రాధ కోసం, పిల్లల కోసం ఎందుకు వృధా శ్రమ పడాలి? తన కడుపు కొట్టి వాళ్ళు హాయిగా బలుస్తూంటే ఏమీ చేతకాని అసమర్థుడిలా ఎందుకు ఊరుకోవాలి తను? ఈ అన్యాయం ఎందుకు భరించాలి?

రాధనీ పిల్లలనీ బయటకు తరిమేస్తే...? ఏం చేస్తారేం? అనాధులమనీ, తన కెవరూ లేరనీ చెప్పుకుంటూ హోటళ్ల ముందర అడుక్కుంటూ, పేవ్‌మెంట్ల మీద కాలం గడుపుతుందా రాధ? విశ్వాసం లేని మనిషి – తన బ్రతుకు రచ్చకీడ్చినా ఈడవగలదు. మహా అయితే పోయేది పరువు. పోనియ్. సుఖం లేనిది జీవితానికి పరువుండి ఏం లాభం?

రాధనీ పిల్లలనీ తరిమేస్తే తను అనాటిలా సుఖంగా జీవించగలడు. అప్పుడు వంటిల్లు అవసరం, అద్దె తగ్గుతుంది. డాక్టరు బిల్లులుండవు. చాలా సుఖపడవచ్చు ఒంటరిగా.

అవును, రాధనీ పిల్లలనీ బయటకు పంపేస్తాడు. అవును అంతే. వాళ్ళ జీవితాలేమైనా నా తన కనవసరం. గతంలో వాళ్లకోసం తను మూర్ఖంగా చేసిన వ్యర్థ త్యాగాలు చాలు. ఇప్పటికయినా కళ్లు విప్పి నిజం గ్రహించడం వివేకం. తను విధించబోయేది శిక్షే అయితే, రాధవంటి స్వార్థపరురాలి కది

